క్లుప్తంగా

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం..



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

విజయనగరం ఫూల్‌బాగ్: క్విట్ ఇండియా స్ఫూర్తితో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ పిలుపునిచ్చారు. మహిళలపై అత్యాచారాలు పెరగడానికి కారణమైన మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి పారదోలాలని నినాదాలు చేశారు. డ్రగ్స్‌ను నిర్మూలిస్తామని ఎల్‌బీజీ నగర్‌లో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వి. లక్ష్మి, పుణ్యవతి, కుమారి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



తహసీల్దార్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: ఇటీవల మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.సురేష్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడ బాబు, తదితరులు శుక్రవారం అభినందించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

రమణకుమారికి అభినేత్రి అవార్డు



చినజియర్ స్వామి చేతుల మీదుగా అభినేత్రి అవార్డు తీసుకుంటున్న వడ్లమాని రమణకుమారి

విజయనగరం టౌన్: కూచిపూడి నృత్యంలో ఎందరో విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యలనగరమైన విజయనగరానికి వన్నె తెస్తున్న ప్రముఖ కూచిపూడి గురువు వడ్లమాని రమణ కుమారిని అభినేత్రి అవార్డు వరించింది. సేవ్ కూచిపూడి, జెట్ వరల్డ్ సైంటిస్టులు సంయుక్తంగా హైదరాబాద్‌లో చినజియర్ స్వామి ఆశ్రమంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

డ్రోన్లపై అవగాహన



డ్రోన్ల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న నాగప్రవీణ్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో డ్రోన్ల వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రోన్లలో రకాలు, ఎలా పనిచేస్తాయి, తదితర అంశాలపై ప్రముఖ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డ్రోన్ టెక్నాలజీ ప్రతినిధి నాగ ప్రవీణ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, విభాగాధిపతి డాక్టర్ దీపక్‌కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



థింసా నృత్య ప్రదర్శనలో గిరిజన విద్యార్థులు

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పలువురు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంచూరీ గ్రూప్ ఆఫ్ బిజినెస్ సీఈఓ కె.ధరణి మాట్లాడుతూ.. గిరిజనులకు చాలా మంచి అభ్యసనా నైపుణ్యాలు ఉంటాయని, వాటిని తగు రీతిలో మలిచితే ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలే కాకుండా వ్యాపారాల్లో కూడా రాణిస్తారన్నారు. యూనివర్సిటీ డీన్ ముక్కామల శరశ్చంద్ర బాబు మాట్లాడుతూ.. గిరిజన విశ్వవిద్యాలయం గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్, చైర్మన్ డాక్టర్ అనిరుధ్‌కుమార్, డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ బొంతుకోటయ్య, డాక్టర్ ప్రేమ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భోగాపురం: అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీలకు సంబంధం లేకుండా మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో ఉండడంతో రాబోయే రోజుల్లో భోగాపురం మండలం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన కొంతమంది ప్రజలు రోడ్డు ప్రమాదాల బారినపడి చనిపోతున్నారని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తీసుకువస్తుంటే సిబ్బంది నిర్లక్ష్యం కనబరుస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే స్పందిస్తూ, పోస్టుమార్టం చేయడంలో నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి బండారు వెంకటేష్‌ను సూచించారు. అలాగే మండలంలోని చాలామంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రతి గ్రామంలోను వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను పంపిణీ చేయాలని, ముందుగానే ఈ క్రాప్ పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఏఓ హరికృష్ణకు సూచించారు. ముక్కాం ఎంపీటీసీ సభ్యుడు బాలాజీ మాట్లాడుతూ.. రామచంద్రపేట, చేపలకంచేరు, రెడ్డికంచేరు సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని ప్రజలు తాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, వైస్ ఎంపీపీలు దంతులూరి రావాడబాబు, పడాల సత్యవతి, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న, మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తహసీల్దార్ సురేష్, హౌసింగ్ డీఈ వైకుంఠరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం..

- చెదపట్టి పాడైన హెచ్‌బీఎస్ఏజీ కిట్లు, గ్లౌజులు



చెద పట్టి పాడైన కిట్లు, గ్లౌజులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మందులు, సర్జికల్ మెటీరియల్ చెదలపాలయ్యాయి. మందులు, సర్జికల్ మెటీరియల్‌ను ఎంతో భద్రంగా భద్రపరచాల్సి ఉంది. ఆస్పత్రిలోని మెయిన్ డ్రగ్ స్టోర్ సిబ్బంది అలసత్వం కారణంగా హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష కిట్లు, గ్లౌజులు, ఇతర మందులు పాడవ్వడంతో బయట పడేశారు. మందుల భద్రపరచడంలో ఇంత నిర్లక్ష్యమా అని పలువురు చర్చించుకుంటున్నారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపం పైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి స్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తా..

- భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్



స్థానిక నాయకులతో రామచంద్రయాదవ్

విజయనగరం టౌన్: భారత చైతన్య యువజన పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన పట్టణంలోని పలు దేవాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ జిల్లా స్థాయి నాయకులు జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామ, మండల, వార్డు స్థాయి కమిటీలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్, పడగల శ్రీనివాస్, పాలి సురేష్, రమణబాబు, శివ, చక్రవర్తి, చిన్నప్పన్న, శేషు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కేటాయించాలి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, పరిశ్రమల శాఖ, కార్మికశాఖ అధికారులు కర్మాగారాలలో తనిఖీలు నిర్వహించి ప్రతి నెలా 25లోగా తనకు నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ – విజయనగరంలో (జీవీ) ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత యూనివర్సిటీ ప్రాంగణంలోని హాస్టల్ పరిసరాలు, అకడమిక్ బ్లాక్–1లో కలుపు మొక్కలను తీసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం–1 పీఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ కె..శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న అభిమానులు

విజయనగరం: సూపర్‌స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం విజయనగరంలో ఘనంగా జరిగాయి. మహేష్‌బాబు అభిమానులు పట్టణంలోని పేర్లవారి చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్‌లు, పండ్లు పంపిణీ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్, సుధీర్‌బాబు కల్చరల్ అసోసియేషన్, విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అభిమాని డి.హుస్సైన్, జిల్లా అధ్యక్షుడుఏ ఆర్‌వీ రమణరాజు మాట్లాడుతూ.. హీరో మహేష్‌బాబు స్థాపించిన ట్రస్ట్ ద్వారా సమాజ సేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డి.రాంబాబు, కార్యవర్గ సభ్యులు బోని అప్పారావు, సాంబ, కామేష్, శేఖర్, ముక్కామల రమేష్, అనుపోజు విజయ్, నారాయణరావు, విజయ్‌కుమార్, కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల నిరసన

విజయనగరం అర్బన్: రైతాంగానికి నష్టం చేస్తున్న కార్పొరేట్ విధానాలను విడనాడాలని కోరుతూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రైతులు నిరసన చేపట్టారు. ఏపీ రైతు, కౌలు రైతు, వ్యవసాయకార్మిక సంఘాల సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం చేపట్టారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్పొరేట్ కంపెనీలను నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బి.రాంబాబు, తొత్తడి పైడిపినాయుడు, శ్రీనివాసనాయుడు, డేగల అప్పలరాజు, ఈదిబిల్లి అప్పారావు, సూరిదేవుడు, సంతోష్, గంగునాయుడు, టీవీ రమణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో రైతులు

ఈ నెల 12 నుంచి శిక్షణ

డెంకాడ: ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

కేసు నమోదు..

భోగాపురం: గంజాయితో పట్టుబడిన యువకులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని నవరవిల్లి గ్రామానికి చెందిన ఓదురు సాయిప్రసాద్, సిమ్మపేట గ్రామానికి చెందిన కొల్లు సాయి.. భోగాపురంలో మరాడ వెంకటేష్, అడ్డగర్ల దెవేంద్ర అనే ఇద్దరు యువకులకు గంజాయి విక్రయిస్తూ గురువారం పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ మేరకు సీఐ రవికుమార్ విచారణ చేపట్టి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


పేకాటరాయుళ్ల అరెస్ట్

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామ శివారులో పేకాటాడుతున్న 11 మంది వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ సభ్యులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారినుంచి రూ.1.26 లక్షలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ రవి కుమార్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బుద్ధదేవ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నెల్లిమర్ల: సీపీఎం సీనియర్ నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బెంగాల్‌ను అభివృద్ధి బాటలో నడిపించిన బుద్ధదేవ్ నిరాడంబర జీవితం గడిపారన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల: పంచాయతీలను అభివృద్ధిబాటలో నడిపించాలని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిఫ్రెష్‌మెంట్ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుకాణాల వేలంపాటకు స్పందన కరువు



కార్పొరేషన్ దుకాణాలు కేటాయించేందుకు వేలం నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

విజయనగరం : మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణాలను లీజు పద్ధతిలో కేటాయించేందుకు శుక్రవారం నిర్వహించిన వేలంపాటకు స్పందన కరవవుతోంది. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన షాపుల బహిరంగవేలంలో కేవలం ఒక దుకాణాన్ని మాత్రమే వేలంలో కేటాయించటం జరిగిందని అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు తెలిపారు. నగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రహరీ చుట్టూ నిర్మించిన 22 దుకాణాలతో పాటు కార్పొరేషన్ కార్యాలయానికి సమీపంలో గల కొత్త, పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు బహిరంగవేలం నిర్వహించారు. అయితే ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న మూడో నంబర్ దుకాణం కోసం మాత్రమే ఇద్దరు పాటదారులు పాల్గొనగా.. అందులో ఒకరికి పాట ఖరారైంది. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ.. మిగిలిన దుకాణాలకు మరోసారి వేలంపాట నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులను తరిమికొట్టాలి..



నినాదాలు చేస్తున్న కార్మికులు

విజయనగరం ఫూల్‌బాగ్: దేశం నుంచి కార్పొరేట్ శక్తులను తరిమికొట్టడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని నినదిస్తూ సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు విజయనగరం జీసీసీ సోప్ యూనిట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎ. జగన్మోహనరావు, ఐద్వా నాయకురాలు వి. లక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీసీసీ ఉత్పత్తులను ప్రోత్సహించి కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. నెలలో 20 రోజులకు మించి పని ఉండడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాందేవ్ బాబా లాంటి వ్యక్తులకు , కార్పొరేట్ శక్తులకు వందల ఏకరాల భూములు, వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు జీసీసీ ఉత్పత్తులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జీసీసీ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుజాత, రమణమ్మ, భారతి, సంతు, శేషు, స్వామి, ఆదినారాయణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు



ఎమ్మెల్యే అదితిగజపతిరాజును సత్కరిస్తున్న స్వర్ణకార సంఘ నాయకులు

విజయనగరం: విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వియనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు హామీ ఇచ్చారు. పట్టణ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు అభినందన సభ స్థానిక బొండాడవీధిలో ఉన్న సంఘ భవనంలో నిర్వహించారు. సంఘ పట్టణ అధ్యక్షుడు లక్కోజు శేఖర్, కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గజమాలలతో ఆమెని సత్కరించారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ సహకార సంఘ ప్రతినిధులు తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పీవీజీ రాజు ఈ ప్రాంతానికి, బీసీ వర్గాలకు ఎంతో సహాయం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంఘ ప్రతినిధులు శేఖర్, మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను గౌరవించుకోవడం మన సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కిల్లంపల్లి ఆచారి, జానా ప్రసాద్, పాలకొల్లు నాని, ముక్కాల శ్రీనివాసరావు, చిన్నబాబు, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

- టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ రైట్స్ ఫోరం ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధులు

విజయనగరం: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగ భానుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాడి సంఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు డి.రాజ్ కుమార్, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.



